క్లుప్తంగా

హాకీ, బేస్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీవై క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలబాలికల హాకీ బేస్‌బాల్ ఉమ్మడి జిల్లాల ఎంపిక పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి పద్మావతి, ఎస్పీవై కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. బేస్‌బాల్ కార్యదర్శి సుబ్బయ్య, కర్నూలు జిల్లా ఫెన్సింగ్ కోచ్ మహేశ్వరరావు, హాకీ కోచ్ సుదర్శన్, దస్తగిరిరెడ్డి, షేక్షావలిరెడ్డి క్రీడాకారులకు వసతి కల్పించారు.

సీపీఎస్ రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీపీఎస్ వద్దు.. సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, గౌరవాధ్యక్షుడు భాస్కరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం గడివేముల, దొర్నిపాడు మండలాలకు చెందిన నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎనుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేసీ నరసింహులు, ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు వ్యవహరించారు. గడివేముల మండల అధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా నరసింహుడు, దొర్నిపాడు మండల అధ్యక్షుడిగా తేజేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా అహమ్మద్ హుసేన్‌ను ఎన్నుకున్నారు. సుమయూన్, ఆనంద్‌బాబు, కలీముల్లా, ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీగా శివకుమార్



నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీగా నంద్యాల కేఎస్‌ఏ మున్సిపల్ హైస్కూల్ పీడీ శివకుమార్‌ను నియమించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగిందన్నారు. శివకుమార్ కుస్తీ, చెస్, క్రికెట్ పోటీల్లో వందలాది మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా చేశారన్నారు. అలాగే జాతీయ స్థాయిలో చెస్, క్రికెట్, కుస్తీ, అథ్లెటిక్స్ క్రీడాకారులను పంపారని చెప్పారు. శివకుమార్‌ను నంద్యాల జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, రవికుమార్, సోమన్న, హెచ్‌ఎంలు రాఘవయ్య, విశ్వనాథ్, సుబ్బన్న, నరసింహ అభినందించారు.

మీసాలు తిప్పడం, తొడలు కొట్టడం సరికాదు

నంద్యాల(అర్బన్): శాసనసభలో మీసాలు తిప్పడం, తొడలు కొట్టడం టీడీపీ నాయకులకు తగదని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. స్కిల్ స్కామ్‌లో అవినీతి రుజువు కావడంతోనే చంద్రబాబు జైలు పాలయ్యారని, దాన్ని సాకుగా చూపుతూ టీడీపీ ప్రజాప్రతినిధులు శాసనసభలో అల్లర్లు చేయడం సబబు కాదన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాసన సభలో టీడీపీ ఎమ్మెల్యేలు ఏం మాట్లాడాలో తెలియక అడ్డగోలుగా వ్యవహరిస్తూ సభా మర్యాదలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుంటే స్కిల్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన చంద్రబాబు కోసం టీడీపీ ఎమ్మెల్యేలు ఆరాట పడటం సిగ్గుచేటన్నారు. అల్లర్లు చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్గీకరణ చేపట్టాలి

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిందేనని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ డిమాండ్ చేశారు. ప్రస్తు పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంహెచ్‌పీ తదితర సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే మాదిగలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు నాగరాజు మాదిగ, కత్తి ఓబులేసు మాదిగ, నరసింహులు మాదిగ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, చైర్మన్ మాధవస్వామి కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఏపీటీఎఫ్, ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 23న తాలూకా కేంద్రాల్లో, 25వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పుల్లయ్య, పోలియోనాయక్, పరమేశ్వరుడు, మహబూబ్ బాషా, లక్ష్మణ్‌నాయక్, శేషారాంనాయక్, ఉపేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

గణపతికి ఘన వీడ్కోలు

ఓం గరుడధ్వజ వందిత
ఓం గణవందన గణాయ ఓం అగ్రణ్యే
ఓం గమ్యాయ నమఃఓం
గంగాదిక శుచి ప్రదాయ గహనాయ నమః



జూలేపల్లెలో రంగులు చల్లుకుంటున్న యువకులు



గంగమ్మ ఒడిలోకి చేరుతున్న వినాయకుడు



నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమ

- వినాయకుడికి ఉదయం ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పణ
- పోటాపోటీగా లడ్డూల వేలం
- నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్, ఎస్పీ
- రంగుల చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్న యువత
- వేడుకను తిలకించేందుకు తరలివచ్చిన జనం
- కిటకిటలాడిన చెరువు కట్ట, పురవీధులు
- కనులపండువగా సాగిన శోభాయాత్ర

నంద్యాల(వ్యవసాయం): ఆది పూజలందుకునే దేవుడు.. ఆది దంపతుల సుతుడు వినాయకుడి నిమజ్జనోత్సవం శుక్రవారం పట్టణంలో వేడుకగా సాగింది. వినాయక చవితిని పురస్కరించుకొని ఈనెల 18వ తేదీన పట్టణంలో నిర్వాహకులు మండపాలు ఏర్పాటు చేసి గణపతి విగ్రహాలను నెలకొల్పి ఐదు రోజుల పాటు విశేష పూజలు చేశారు. చివరి రోజు స్వామి వారికి ఉద యం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి లడ్డూ లు వేలం వేసి, ఆనందోత్సాహాల నడుమ, ఊరేగింపుగా తరలించి చిన్నచెరువులో నిమజ్జనం చేసి వీడ్కో లు పలికారు. వేడుకను తిలకించేందుకు పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు తరలిరావడంతో పుర వీధులు, చెరువు కట్ట ప్రాంతాలు కిటకిటలాడాయి.

శోభాయమానంగా.. శోభాయాత్ర..

చెరువుకట్టపై ఏర్పాటు చేసిన వినాయక ఘాట్‌లో భక్తులు గణేష్ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల ఊరేగింపు శోభాయమానంగా సాగింది. వినాయక ఘాట్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టిశ్రీధర్, గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి సంప్రదాయబద్ధంగా ఉదయం 10.30 గంటలకు పూజలు చేసి నిమజ్జన వేడుకలను ప్రారంభించారు. సాయంత్రం గణేష్ కేంద్ర సమితి ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో స్వాగత మండపాన్ని ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నుంచి విగ్రహాల ఊరేగింపు ఊపందుకుంది. విగ్రహాలన్నీ వివేకానంద సర్కిల్ చేరుకోవడంతో అక్కడి నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. బైర్మల్‌వీధి, రీడింగ్ రూం జంక్షన్, మెయిన్ బజార్, గాంధీచౌక్, జుమ్మామసీదు, పార్కు రోడ్డు మీదుగా ఊరేగింపు సాగింది. భక్తులు రోడ్లకు ఇరువైపులా బారులుదీరి ఊరేగింపును తిలకించారు. కాగా 600కు పైగా విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వినాయక ఘాట్ వద్ద 5 క్రేన్‌లను ఏర్పాటు చేశారు. నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, ఇరిగేషన్, పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు.

హోరాహోరీగా లడ్డూ వేలం..

గణనాథుడి ప్రసాదం లడ్డూ వేలాల్లో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. బొమ్మలసత్రం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద లడ్డూ వేలంలో దూదేకుల షరీఫ్ రూ.1,14,500కు దక్కించుకున్నారు. భగత్ సింగ్ కాలనీలో రూ.లక్షకు హుసేన్ సొంతం చేసుకున్నారు. టీచర్స్ కాలనీలో గౌరీ యాదవ్ రూ.92వేలకు పాడారు.

భక్తుల సేవలో..

గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని పట్టణంలో గాంధీచౌక్, కాళికాంబగుడి, కల్పనా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసనగర్, వినాయక ఘాట్‌ల వద్ద నవనంది రోటరీ క్లబ్, లయన్స్‌క్లబ్, ఖాళీమాత సేవా సమితి, పట్టణ జనరల్ మర్చెంట్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రసాదాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

నంద్యాల(సెంట్రల్): వినాయక చవితి సందర్భంగా స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో మిర్చి కమీషన్ ఏజెంట్లు ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని శుక్రవారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. మార్కెట్‌యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. యార్డు అధికారి శేషిరెడ్డి, మిర్చి కమీషన్ ఏజెంట్లు, రైతులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు. గ్రామంలో నాలుగు చోట్ల విగ్రహాలను కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు గ్రామంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు విశేష పూజల అనంతరం నైవేద్యం సమర్పించి విగ్రహాలను ఊరేగింపుగా నిజమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని కుంటలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం

ఆళ్లగడ్డ: పట్టణంలో శుక్రవారం వినాయక నిమజ్జనం ఘనంగా సాగింది. ఐదు రోజులుగా కొలువైన వినాయక ప్రతిమలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమాలు, అర్చనల అనంతరం మధ్యాహ్నం సామూహిక అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో పట్టణ వీధుల్లో ఊరేగింపుగా నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్నారు. అక్కడ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు, చిన్నారులు వసంతం చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. పట్టణ శివారులోని వక్కిలేరు వాగులో పట్టణ పరిధిలో కొలువైన 156 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమం అర్ధరాత్రి వరకు కొనసాగింది. డీఎస్పీ వెంకట్రామయ్య పర్యవేక్షణలో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు





వేలంలో లడ్డూను దక్కించుకున్న పాటదారులు



చిన్నారుల సంప్రదాయ నృత్యం











నంద్యాలలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం , ఆళ్లగడ్డలో వాహనాలపై తరలుతున్న వినాయక ప్రతిమలు, వక్కిలేరులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం , నంద్యాలలో భక్తులకు అన్నదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు

భూహక్కు పత్రాలొచ్చాయ్

దొర్నిపాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా రైతులకు భూహక్కు పత్రాలు మంజూరయ్యాయి. మండలంలో ముందుగా గుండుపాపల, కొండాపురం గ్రామాల్లో భూరీసర్వే పూర్తి చేయడంతో రైతులకు భూ యాజమాన్యపు హక్కుపత్రం–పట్టాదారు పాసు పుస్తకాలను సిద్ధం చేశారు. కొండాపురంలో 358, గుండుపాపల గ్రామంలో 591 మంది రైతులకు శనివారం పుస్తకాలు అందజేస్తామని తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు. రైతు ఫొటోతో పాటు సర్వేనంబర్, ఖాతా నంబర్, క్యూఆర్ కోడ్ పొందుపర్చారు. అయితే నూతనంగా పాస్ పుస్తకంలో సర్వే నంబర్‌కు సంబంధించిన ఎఫ్‌ఎంబీ, భూభాగ్యపు నంబర్ (ల్యాండ్ పార్సిల్ నంబర్)ను నూతనంగా చేర్చారు. భూశోధక్ యాప్‌లో పాస్‌పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే రైతుల వివరాలు వెల్లడవుతాయి. నీటిలో తడిచినా పత్రం పాడవకుండా పాలిథీన్‌తో చేయించారు.



భూహక్కు పత్రంలో రైతు పొలం వివరాలతో పాటు ఎఫ్‌ఎంబీ, క్యూఆర్ కోడ్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మృతి చెందిన ప్రేమ్‌కుమార్

గోస్పాడు: తేళ్లపురి–నంద్యాల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పేమ్‌కుమార్ (23) మృతి చెందినట్లు ఎస్‌ఐ మల్లికార్జున శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి బనగానపల్లె నుంచి నంద్యాలకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి తేళ్లపురి సమీపంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నీటి విశిష్టతపై అవగాహన



గాంధీ చౌక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు శుక్రవారం నీటి విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం అసదుల్లా హుసేన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పాఠశాలనుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే ఉర్దూ పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సలాముల్లా తెలిపారు. 3, 4, 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 6, 7, 8 తరగతులకు డిజిటల్ బోధన, ఇంట్రాక్టివ్ ఫ్యాట్ ప్యానల్‌ను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. హెచ్‌ఎం అబ్దుల్ అజీజ్, నంద్యాల శాఖ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన సబున్నా, ఆర్మీయ, రహమత్, అబ్దుల్ సమ్మద్‌కు ప్రశంసా పత్రాలతో పాటు నగదును బహుమతి అందజేశారు.

మహిళల జీవనోపాధికి భరోసా

ఆళ్లగడ్డ: స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధితో పాటు స్వయం ఉపాధికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ సరళాదేవి తెలిపారు. రూరల్ మండలం ఎస్. లింగందిన్నె గ్రామంలో రూ.4 లక్షల రుణంతో పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మహిళలకు జీవనోపాధి అవకాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం విభిన్న రంగాలపై అవగాహన కల్పించడంతో పాటు రుణాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దానం, నాన్ ఫాం యాంకర్ పర్సన్ బాబురావు, శ్రీనిధి మేనేజర్ ఫరూక్, ఏపీఎం ప్రసాద్ తదితరులున్నారు.



ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న సరళాదేవి

26న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

నంద్యాల(సెంట్రల్): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన స్థానిక పద్మావతినగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 10గంటలకు విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని జిల్లా పర్యాటక–సాంస్కృతిక శాఖాధికారి సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన తొలి ముగ్గురికి వారికి ఈనెల 27న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు నూనెపల్లెలోని జిల్లా పర్యాటక శాఖాధికారి కార్యాలయంలో, సెల్ 7995087089, 9966028028, 8297098022లో సంప్రదించాలని సూచించారు.

లోయలో నుంచి ట్యాంకర్ వెలికితీత

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ట్యాంకర్ లోయలో పడిన విషయం తెలిసిందే. ఈ నెల 16న నిడదవోలు నుంచి నంద్యాల వైపు వస్తున్న కూల్‌డ్రింక్స్ స్పిరిట్ ట్యాంకర్.. బైకు, కారును ఢీకొని లోయలో పడింది. వారం రోజుల తర్వాత శుక్రవారం మూడు భారీ క్రేన్ల సాయంతో లోయలో నుంచి ట్యాంకర్‌ను బయటికి తీశారు. ఈక్రమంలో ఘాట్‌రోడ్డులో కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదకర మలుపుల వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతుందని, ఆర్‌అండ్‌బీ, పోలీసుశాఖ అధికారులు స్పందించి ముందు జాగ్రత్తల్లో భాగంగా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ట్యాంకర్‌ను క్రేన్లతో తీస్తున్న దృశ్యం

భారీ వర్షం

- దొర్నిపాడు, రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లో పొంగిపొర్లిన వాగులు, వంకలు

దొర్నిపాడు: వర్షం కురుస్తున్నా జలాశయాలు నిండలం లేదు. అయితు అదునుగా కురుస్తూ పంటలను మురిపిస్తుంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం 30.4 మి.మీ నమోదైందని తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు. దీంతో వాగులు, వంకలు, కుందూనదిలో వర్షపు నీరు పొంగిపొర్లింది. కంది, మిరప, జొన్న, పత్తి పంటలకు ఈ వర్షం ఊపిరి పోసింది.

రుద్రవరం: మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు,వంకలు పొంగి ప్రవహించాయి. అలాగే పంట పొలాల్లో పొలవగా నీరు ప్రవహించడంతో మొలక దశలో ఉన్న జొన్న, వరి పైర్లు కొట్టుకుపోగా పత్తి,మినుము పంటలో నీరు నిలిచింది. ఈ ఏడాది వర్షా కాలం మొదలైనప్పటి నుంచి అరకొరగా వర్షం కురిసింది. నేటి వాననే భారీ వర్షమని రైతులు పేర్కొంటున్నారు. కాగా మండలంలో 10 సెం.మీ వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. భారీ వర్షానికి రుద్రవరం–శిరివెళ్ల, పేరూరు–ఎర్రగుంట్ల, ఎర్రగుడిదిన్నె– నంద్యాల జాతీయ రహదారి, చిలకలూరు–ఆళ్లగడ్డ మండలం బత్తలూరు వైపు ఉన్న వక్కిలేరు వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమై ఎర్రగుడిదిన్నె వైపు వచ్చిన 108 వాహనం వక్కిలేరు వాగు ఉధృతికి వెనుకకు వెళ్లి పోయింది. రుద్రవరం ఆర్.కొత్తూరు, ఆర్.కొత్తపల్లె,చందలూరు,ఎర్రగుడిదిన్నె గ్రామాల వైపు రైతులు ఇటీవలె జొన్న పంట సాగు చేయగా మొలకదశలో ఉండింది.వర్షం భారీగా కురవడంతో పైరు నీట మునిగింది. తిప్పారెడ్డి పల్లె మెట్ట వద్ద ఎగువ భాగం నుంచి ప్రవహించే నీటి ఉధృతికి కొన్ని ఎకరాల్లో వరి పైరు కొట్టుకుపోయింది. రుద్రవరం, నర్సాపురం, ఎల్లావత్తుల, ముకుందాపురం, చందలూరు,తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో వర్షపు నీరు నిలిచింది. ప్రస్తుతం మొక్కజొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆరబోసుకున్న దిగుబడులు తడిసి ముద్దయ్యాయి.

శిరివెళ్ల: మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలో 10.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. శిరివెళ్ల–రుద్రవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న వక్కిలేరు పొంగి బ్రిడ్జిపై ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. పంట పొలాలలోకి నీరు చేరి చెరువులను తలపించాయి. లోతట్టు పొలాలో భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. జొన్న, మినుము పంటల సాగుకు పొలాలు పదునయ్యాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ వర్షాకాలంలో ఇదే పెద్ద వర్షం.



వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న నీరు







దొర్నిపాడు శివారులో పొంగిపొర్లుతున్న పంటకాల్వ , తిప్పారెడ్డిపల్లె వద్ద కొట్టుకుపోయిన వరి పైరు, శిరివెళ్ల : అండర్ పాస్‌వేలో నిలిచిన వర్షపు నీరు

పల్లకీలో ఆది దంపతులు

మహానంది: కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ.. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం చేపట్టారు. గోమాతకు విశేష పూజలు చేసిన అనంతరం పల్లకీ వెంట ఊరేగించారు.



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

కొలిమిగుండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇంటర్ విద్యార్థులు రవిరాజు, హ్యాండ్‌బాల్‌కు దస్తగిరి,ఉదయ్ ఎంపికై నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అండర్–17 విభాగంలో హ్యాండ్ బాల్ పోటీలకు శ్రీకాంత్, కార్తీక్, త్రోబాల్‌కు జీవిత, కబడ్డీకి నరసింహ సెలెక్ట్ అయ్యారు. అలాగే అండర్–14 విభాగంలో వాలీబాల్ పోటీలకు శ్రీకాంత్‌రెడ్డి, శంకర్, అబ్దుల్లా ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను క్రీడల్లో రాణించేలా కృషి చేసిన పీడీ గంగాదేవిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరం

వెలుగోడు: పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కల్పించారు. బీడీ, చుట్టా, సిగరేట్, జరదా, తంబాకు, పాన్‌మసాలా వంటి వాటిని ఉపయోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. పొగాకు వాడడం వల్ల హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్, సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య, నాగవాణి, మొయిద్దీన్, సురేందర్ సింగ్, ఫైజుల పాల్గొన్నారు.